విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం, కెపి పాలెం, మొగల్తూరు తదితర గ్రామాల్లో మంగళవారం విద్యుత్ శాఖ ఎస్ఇ ఆలపాటి రఘునాథ్ బాబు పర్యటించారు. ఈ నెల 13న రాత్రి వచ్చిన గాలులు, వర్షానికి పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు, స్తంభాలు ధ్వంసం అయ్యాయి. విద్యుత్ శాఖ అధికారులు వాటికి మరమ్మతులు చేసి మంగళవారం సాయంత్రానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఆ శాఖ ఎస్ఇ ఆలపాటి రఘునాథ్ బాబు సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఇఇ కె.మధుబాబు, డిఇ ఓంకారం, జెఇజె ప్రభాకర్‌రావు ఉన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఇ

ఆక్వా రైతాంగాన్ని ఆదుకోకపోతే.. ఆందోళనకు సిద్ధం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించిన ఆక్వా రైతుల సదస్సు

జిల్లా ఆక్వా పరిరక్షణ నూతన కమిటీ ఎన్నిక

అమెరికా సంకాలను నిరసిస్తూ ఆక్వా రైతుల నిరసన ర్యాలీ

ఆక్వా రైతాంగానికి అండగా సిపిఎం: రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం: రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

'ఒకపక్క నాణ్యమైన సీడ్ దొరకట్లేదు.. మరోపక్క ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. ఇంకోపక్క వైరస్ ప్రభావం.. రొయ్యలకు సరైన ధర లేక గత ఆరు నెలల నుంచి సతమతమవుతుంటే ట్రంప్ విధించిన సుంకం కుతలం చేసింది. తక్షణం ఆక్వా రైతాంగాన్ని ఆదుకోకపోతే ఆందోళన మరింత ఉధృతం చేసేందుకు సిద్ధం' అని ఆక్వా రైతుల సదస్సు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించింది. స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆక్వా రైతుల సదస్సు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాసరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి సదస్సుకు వచ్చిన ఆక్వా రైతులు అనేక సమస్యలను సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వాలకు విదేశీ మారకద్రవ్యం సమకూరుస్తున్నప్పటికీ ఆక్వారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అనేక సమస్యలతో సతమతమవుతున్న ఆక్వా రంగం ట్రంప్ టారిఫ్ దెబ్బతో సంక్షోభంలో పడిందన్నారు. సిండికేట్ మాయాజాలం ఆక్వా రంగాన్ని కుదిపేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా కమిటీని వేసినా ఎటువంటి ఉపయోగమూ లేదన్నారు. ఆక్వా రైతులు చేపట్టే ఆందోళనలకు సిపిఎం పూర్తి మద్దతు ఇస్తుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని చెప్పారు. అవసరమైతే ప్రత్యక్షంగా రంగంలోకి దిగి సమస్యల పరిష్కారానికి అన్ని సంఘాలను కలుపుకుని కృషి చేస్తామన్నారు. రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యాగరమైన ఈ జిల్లాలో ఆక్వా రంగం అభివృద్ధి చెందుతున్న సమయంలో క్లిష్టమైన పరిస్థితులు రావడం బాధాకరమన్నారు. ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, అంతా ఒక తాటిపైకి వచ్చి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర పూర్వపు నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఆక్వా రంగంలో అనేక మంది కార్మికులు, వ్యవసాయ కార్మికులు, మహిళలు ఉపాధి పొందుతున్నారన్నారు. అలాంటి రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం సరైనది కాదన్నారు. ఆక్వా రంగాన్ని నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ సదస్సుకు ఆహ్వానం పలకగా, జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు వందన సమర్పణ చేశారు. ప్రజా కళాకారులు షేక్ వలీ, చైతన్య ప్రసాద్ గీతాలను ఆలపించారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, ఆక్వా రైతు వర్రె ముసలయ్య, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

హాజరైన ఆక్వా రైతులు

ఐదు డిమాండ్లతో తీర్మానాన్ని ఆమోదించిన సదస్సు

ఆక్వా రైతుల సదస్సు ఐదు డిమాండ్లతో కూడిన తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఆమోదించింది. ఆక్వా రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, ట్రంప్ సుంకాలు విరమించేందుకు చర్యలు చేపట్టాలని, 100 కౌంట్‌కు రూ.270 గిట్టుబాటు ధర కల్పించాలని, ఫీడ్ టన్నుకు రూ.30 వేలు తగ్గించాలని, ఆక్వాజోన్, నాన్ ఆక్వాజోన్‌తో సంబంధం లేకుండా రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సదస్సులో తీర్మానం ఆమోదించారు.

ఆక్వా పరిరక్షణ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

సదస్సులో ఆక్వా పరిరక్షణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. బల్లేపల్లి శ్రీనివాసరావు, నక్క కుమార్, గుత్తుల శ్రీరామచంద్రుడు, షేక్ ఆలీ హుస్సేన్, సందక సూరిబాబు, తిరుమాని నాగేశ్వరరావు, పాలా వెంకటస్వామి, తాటి పట్టి ప్రసాద్, కేశన యాదగిరి, వర్రే ముసలయ్య, కాస నరసింహులు, రుద్రరాజు యువరాజుతో కమిటీ ఎన్నికైంది.

ఆక్వా రైతుల నిరసన ర్యాలీ

స్థానిక మావుళ్ళమ్మ గుడి రోడ్లో సిపిఎం ఆధ్వర్యంలో ఆక్వా రైతులను ఆదుకోవాలని, అమెరికా సుంకాలను ఎత్తివేయాలని ఆక్వా రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. సదస్సుకు హాజరైన నేతలంతా ర్యాలీలో పాల్గొన్నారు.

ఆదాయం ప్రభుత్వానికి.. ఆత్మహత్యలు రైతులకు.. ★★★

బి.బలరాం, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు



30 ఏళ్ల క్రితం ఆక్వా సాగును ప్రారంభించింది సన్న, చిన్నకారు రైతులే. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఈ రైతులే ఉన్నారు. అప్పట్లో రొయ్య డాలర్ పంట. కిలో రూ.500 ఉండేది. ఇప్పుడు సీడ్ నాణ్యత లేదు. ఫీడ్ ధర ఎక్కువగా ఉంది. సాగు వ్యయం విపరీతంగా పెరిగింది. దీనికితోడు ప్రభుత్వ విధానాలు సరిగా లేవు. ఫలితంగా ఆక్వా రంగం సంక్షోభంలో పడింది. ప్రభుత్వాలకు ఆదాయం సమకూర్చుతుంటే రైతులకు మాత్రం ఆత్మహత్యలు మిగులుతున్నాయి. మత్స్యశాఖ, ఎంపెడా, నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అసలున్నాయో, లేవో కూడా తెలియదు. 30 ఏళ్ల క్రితం భీమవరంలో ఆక్వా సదస్సు నిర్వహించింది. ఎంపెడా కార్యాలయాన్ని సిపిఎం ముట్టడిస్తే ఛైర్మన్ వచ్చి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గుర్తు చేశారు. ప్రభుత్వ పెద్దలు అంతా ఎగుమతిదారులుగా ఉన్నారు. రైతుల బాధ వాళ్లకి ఎలా తెలుస్తుంది. ఫీడ్, సీడ్ ధరల తగ్గింపు, విద్యుత్ రాయితీలు కూటమి ప్రభుత్వం చేతుల్లోనే ఉన్నాయి. అయితే ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుంది.

ఆక్వా రైతుల సమస్యలు పట్టని ప్రభుత్వం.. ★★★

జెఎన్‌వి.గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఒకప్పుడు జిల్లా ధాన్యాగారంగా పిలవబడేది. ప్రస్తుతం వ్యవసాయం మరుగున పడుతుంది. ఆక్వా సాగు విస్తరించింది. జిల్లాలో 20 మండలాలు ఉంటే 12 మండలాల్లో ఆరు వేల మంది వరకు రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. విద్యుత్ రాయితీ వర్తించట్లేదు. ఏడాదికి రూ.25 లక్షలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఫీడ్ ధర విపరీతంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఫీడ్ కిలో రూ.25 తగ్గించాలి. ప్లాంట్ యజమానులు సిండికేట్ అయ్యారు. ట్రంప్ సుంకం ప్రకటించారో, లేదో ఇక్కడ రేటు తగ్గించారు. ఆక్వా రైతులకు ఉండాలనే ఈ సదస్సు నిర్వహిస్తున్నాం.

ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది.. ★★★

బొల్లెంపల్లి శ్రీనివాసరావు, ఆక్వా రైతు

25 ఏళ్ల నుంచి రొయ్యల సాగు చేస్తున్నాను. అప్పట్లో టన్ను మేత ధర రూ.25 వేలు ఉంటే ప్రస్తుత రూ.లక్ష ఉంది. 60 కౌంటు ధర అప్పుడు రూ.450 ఉంటే ఇప్పుడు రూ.300కు తగ్గింది. 30 కౌంట్ ధర కూడా రూ.500 నుంచి రూ.400కు తగ్గింది. 10 నెలల నుంచి మేత ధరలు తగ్గలేదు. ట్రంప్ సుంకం మరిన్ని నష్టాలు తెచ్చిపెట్టింది. రూ.1.50 విద్యుత్ సబ్సిడీ కూడా వర్తించట్లేదు. 100 కౌంట్ కిలో సాగు ఖర్చు రూ.250 అవుతుంది. దీన్ని ప్రభుత్వం రూ.220కు కొనుగోలు చేయమంటోంది. ఇదీ అమలు కావడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆత్మహత్యలు తప్పవు. ఆక్వా రైతాంగ సమస్యల పరిష్కారానికి సిపిఎం ముందుకు రావడం అభినందనీయం.

రైతాంగానికి ప్రభుత్వం చేయూతనివ్వాలి.. ★★★

నక్క కుమార్, ఆక్వా రైతు

వంద మంది రైతులు వరి సాగు చేస్తే అందరికీ ఎంతోకొంత లబ్ధి చేకూరుతుంది. ఆక్వా సాగు నూటికి 20 నుంచి 30 మందికి మాత్రమే లాభాలు చేకూరుస్తుంది. మిగిలిన రైతులందరికీ నష్టాలే వస్తున్నాయి. గిట్టుబాటు ధర లేకపోవడం దీనికి ప్రధాన కారణం. రైతుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవు. ప్రస్తుతం 36 వేల టన్నుల రొయ్యలు ఎగుమతవుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు 10 లక్షల ఎకరాల్లో సాగు చేయమంటున్నారు. 36 వేల టన్నుల ఎగుమతికి దిక్కు లేకపోతే అన్ని ఎకరాల్లో సాగు చేయటం వల్ల రైతులకు ఇబ్బందులు తప్ప మరేది ఉండదు.

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి.. ★★★

డి.రవితేజ, ఆక్వా రైతు

ఫీడ్ ధర తగ్గలేదు. అయితే సుంకం పేరుతో రూ.40 నుంచి రూ.60 వరకూ రొయ్య ధర తగ్గించారు. గాలి, వాన వస్తే విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఎవరూ పట్టించుకోవట్లేదు. మార్కెటింగ్ సమస్య తీవ్రంగా ఉంది. నాలుగు నెలల నుంచి కంటి మీద కునుకు లేదు. మిర్చి అపరాలు వంటి వాటికి కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. లాభాలు తెచ్చిపెడుతున్న ఆక్వా సాగుకు మాత్రం కోల్డ్ స్టోరేజీలు లేవు. కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేస్తే ఆక్వా రైతులకు ఉపయోగకరం.

ఆక్వా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారు.. ★★★

షేక్ ఆలీ హుస్సేన్, ఆక్వా ఎక్స్‌పోర్టర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నాయి. 2014లో ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేస్తామని మోడీ చెప్పారు. ఆక్వా హబ్‌గా ఈ ప్రాంతాన్ని మారుస్తామన్నారు. ఆక్వా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఇవేమీ అమలు కాలేదు. మత్స్య శాఖ అసలు పని చేయట్లేదు. నేషనల్ ఫిషరీష్ డెవలప్‌మెంట్ శాఖ ఉందో, లేదో కూడా తెలియదు.

రొయ్యలు పోషకాహారమని అవగాహన కల్పించాలి.. ★★★

కృష్ణారావు, రైతు కార్యాచరణ సమితి సభ్యులు

చెరువుల లీజు దగ్గర నుంచి అడుగడుగునా అనేక సమస్యలు ఉన్నాయి. ప్రస్తుతం లీజు రూ.1.50 లక్షల వరకు ఉంది. ఫీడ్, సీడ్ ధరలు విపరీతంగా ఉన్నాయి. కోల్డ్ స్టోరేజీలు లేవు. 80 నుంచి 90 శాతం ఇక్కడ పండించిన రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. రొయ్యలు ఎంతో పోషక విలువలు కలిగినవి. అయితే ఇక్కడ మాత్రం ఇవి తినరు. కేజీ మటన్ రూ.11 వందలున్నా కొంటారు. కానీ రూ.220 ఉన్న రొయ్యలు మాత్రం కొనరు. రొయ్యలు పోషకాహారమని అందరిలో అవగాహన కల్పించాలి.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఇసుక అందుబాటులో ఉంచేలా చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని నియోజకవర్గాల్లో ఇసుక అందుబాటులో ఉంచేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాకు ఐదు లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక సేకరణ లక్ష్యంగా నిర్ణయించుకుని రానున్న వర్షాకాలం కంటే ముందుగా ప్రతి నియోజకవర్గంలో 70 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను డంప్ చేసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని రవాణా పూర్తి చేయాలన్నారు. భీమవరం, ఆచంట, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఉండి, తాడేపల్లిగూడెం స్టాక్ యార్డులను ఏర్పాటు చేశామని, ప్రతిరోజూ సుమారు 60 ట్రక్కులకు తక్కువ కాకుండా జిల్లాకు ఇసుక రవాణా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి బి.రవికాంత్, ఆర్‌టిఒ ఉమామహేశ్వరరావు, జిల్లా భూగర్భ జల శాఖాధికారి కె.గంగాధర్, ధవళేశ్వరం గోదావరి రివర్ కన్జర్వేటర్ ఇఇ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎఇ ఎస్.రమేష్, తహశీల్దార్లు, ఏజెన్సీలు, టిప్పర్ యజమానులు పాల్గొన్నారు.

సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు స్థలాలు గుర్తించాలి

పిఎం సూర్యఘర్ పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారుల వినియోగానికి సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. ఆమె జిల్లాలోని విద్యుత్ శాఖ ఇఇలు, డిఇలు, ఎఇలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ఇప్పటి వరకు 14,392 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ చేయగా 917 గృహాలకు మాత్రమే సోలార్ విద్యుత్ ఏర్పాటు చేశారన్నారు. ఈ పథకం అమలు అనుకున్నంత వేగంగా జరగటం లేదని అసహనం వ్యక్తం చేశారు. కనీసం నెలకు ప్రతి మండలానికి 24 కనెక్షన్లు పూర్తి చేసేలా శ్రద్ధ వహించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ప్యానెల్స్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలన్నారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి రఘునాథ్ బాబు, అధికారులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను వినియోగించుకోవాలి

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు చదువు ఎంతో ముఖ్యమని, దీనిలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన 'ఉల్లాస్'పై జిల్లాస్థాయి కన్వర్జెన్సీ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు జిల్లాలోని 21,628 మంది స్వయం సహాయక సంఘాల మహిళ సభ్యులను లక్ష్యంగా చేసుకుని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మే 5వ తేదీ నుండి సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఆరు నెలలపాటు ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతను పెంపొందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఉల్లాస కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి 3,895 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారని తెలిపారు. సమావేశంలో వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ జి.సిహెచ్.ప్రభాకర్, కమిటీ సభ్యులు డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, మెప్మా ఎఒ జి.హెప్సిబా, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, డిఇఒ ఆఫీస్ ఎడి సత్యనారాయణ, జెడ్‌పి సూపరింటెండెంట్ బివిఎస్‌వి.శర్మ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

రూ.3 కోట్లతో 800 సీసీ కెమెరాలు

నేర పరిశోధనకు పటిష్టమైన వ్యవస్థ - డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్రంలోనేకాక దేశానికి ఆదర్శప్రాయంగా నిలిచేలా నియోజకవర్గంలో రూ.మూడు కోట్ల ఖర్చుతో 800కుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కె.రఘురామ కృష్ణంరాజు చెప్పారు. నేర పరిశోధనకు పటిష్టమైన సీసీ కెమెరా వ్యవస్థ ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. నియోజకవర్గ పరిధిలోని దాతల సహకారంతో నిధులు సమకూర్చుతున్నామన్నారు. దాతల నుండి సాయం స్వీకరించే కార్యక్రమం మంగళవారం స్థానిక సిఐ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ మొత్తం 45 రోజుల్లో నియోజకవర్గంలో పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో సుమారు 70 శాతం వరకు నిర్మాణం పూర్తయి ఆగిపోయిన నిర్మాణాలను త్వరలో పూర్తి చేస్తామన్నారు. విద్య, వైద్య రంగాల్లో అవసరమైన పూర్తి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామన్నారు. భద్రతకు సంబంధించి ముందుగా ఆక్రమణలు తొలగించడం అవసరమన్నారు. గ్రామ, పట్టణ శివార్లలో ఉన్న ఆక్రమణలను రానున్న మూడు నెలల్లో తొలగించి వారికి అవసరమైన ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. దేశానికే మోడల్ నియోజకవర్గంగా ఉండిని తీర్చిదిద్దాలనేది తన కోరికన్నారు. ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్ మాట్లాడుతూ వెయ్యి కెమెరాలు ఒక్క నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం దేశంలోనే అరుదైన అంశమన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రతి విషయంలోనూ ప్రజలను భాగస్వాములను చేయడం అద్భుతమన్నారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ ఆస్మీ మాట్లాడుతూ వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, కూటమి నేతలు కోరా రామ్మూర్తి, జుత్తిగ నాగరాజు, మోటుపల్లి రామవరప్రసాద్ పాల్గొన్నారు.

దాతలందరూ అక్కడికక్కడే చెక్కుల రూపంలో తమ విరాళాలు అందజేశారు. దాతలకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, కలెక్టర్ నాగరాణి, డిఐజి అశోక్‌కుమార్ శాలువాలు కప్పి సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యుటిఎఫ్ కృషి అభినందనీయం - డిఇఒ నారాయణ

ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిఇఒ నారాయణ

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం యుటిఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా విద్యాశాఖాధికారి వివిఎస్-ఎస్ఎల్.నారాయణ అన్నారు. పెదఅమిరం స్పెషల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం కార్యక్రమంలో భాగంగా ఆటోపై మైక్ ప్రచార కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని చక్కని సౌకర్యాలు విద్యార్థులకు ఇస్తున్న నాణ్యమైన కిట్‌తోపాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయుల గురించి తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రయత్నించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు మాట్లాడుతూ హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాలుగా ఏర్పడ్డ యుటిఎఫ్ హక్కుల కోసం పోరాటంతో పాటు తమ బాధ్యతల పట్ల కూడా అంతే అంకితభావంతో ఉంటుందన్నారు. డివైఇఒ ఎస్.రమేష్, ఎంఇఒ ఎ.రవీంద్ర, ఎంఇఒ-2 వి.వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, క్లస్టర్ హెచ్ఎం కె.నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చక్కని కృషి చేస్తున్న యుటిఎఫ్ మండల శాఖను అభినందించారు. యుటిఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.రాజమౌళి కోటేశ్వరస్వామి, ఎం.శంకర్రావు మాట్లాడుతూ ప్రతిరోజూ మూడు గ్రామాల చొప్పున ఆటోలో తిరుగుతూ అన్ని గ్రామాల్లో ప్రచారం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణంరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి.రామరాజు, ఎస్ఎంసి ఛైర్మన్ డి.రోజాపుష్పం, ఉపాధ్యాయులు మురళీ, కుమార్‌రాజు, రవిచంద్ర కుమార్, సునీత, సుధారాణి గ్రామ పెద్దలు రాఘవులు, సెబాస్టియన్ పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెంటపాడు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఎంఇఒకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపవరపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ 23 సంవత్సరాల నుంచి ఈ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం కింద రూ.3 వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయని, రోజుకు వంద రూపాయల కూలికి పనిచేస్తున్న కార్మికులు ఏ విధంగా కుటుంబాలను పోషించుకుంటారని తెలిపారు. ఒకపక్క నిత్యావసర ధరలు, కరెంట్ ఛార్జీలు, గ్యాస్ ధరలు ఇంటి అద్దెలు, స్కూల్ ఫీజులు, వైద్య ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నా వారి జీతాలు మాత్రం పెరగడం లేదని తెలిపారు. కేరళ రాష్ట్రంలో రోజుకు రూ.600 కనీస వేతనం అమలు చేస్తోందని, ఆ విధంగా ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. ఈ పథకంలో పనిచేస్తున్న వారికి గుర్తింపు కార్డులివ్వాలని, స్కూల్ సీపర్లకు కూడా కనీస వేతన జిఒ అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.దయామణి, వి.శ్రీదేవి, ఎం.విమల, వై.విజయకుమారి, ఎం.జ్యోతి, కె.ప్రియాంక, కె.పద్మ, బి.శాంతి, కసిరెడ్డి అచ్చమ్మ, సిహెచ్.మాధవి, కె.బాలమ్మ, రాఘవ, కొండ జ్యోతి, జామి రామలక్ష్మి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - తణుకు

మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలివ్వాలని సిఐటియు మండలాధ్యక్షులు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల స్థానంలో వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, గ్రాట్యూటీ ఇవ్వాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణబాబు, గుబ్బల గోపీ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోగా ఉన్న సౌకర్యాలను తొలగించడం దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు లేక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్జి కృష్ణబాబు, అనంతలక్ష్మి, రాణి, మందులయ్య, రమేష్, జ్యోతి బాబు, నాగేంద్ర కుమార్, రాజమ్మ, సోంపద్మ, గంగాధర్, సురేష్, లోవరాజు, రమణ, రాజేశ్వరి, కృష్ణారావు, కుసుమ, శ్రీను, నాని, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఉపాధ్యాయిని పద్మకు గిన్నిస్ బుక్ అవార్డు

ప్రజాశక్తి - కాళ్ల

సీసలి హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తున్న చెల్లుబోయిన పద్మ సంగీత వాయిద్య ప్రదర్శనల్లో అత్యంత ప్రతిభ కనబర్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్లో స్థానం సంపాదించారు. కీబోర్డ్ ఉపయోగించి సంగీతంలో మంచి ప్రతిభ కనబర్చిన పద్మకు హైదరాబాద్లో హలెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డ్ అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సువార్తికులు బ్రదర్ అనిల్ కుమార్, గిన్నిస్ బుక్ ప్రతినిధి రాజేంద్ర్ ఆమెను అభినందించారు. గిన్నిస్ రికార్డ్ సాధనలో 1090 మంది పాల్గొనగా 1049 మంది మిస్ రికార్డును అందుకున్నారు. గంటసేపు 1090 మంది వివిధ పాటలను కీబోర్డ్పై నిర్విరామంగా వాయించగా 1049 మంది ఎంపికయ్యారు. ఉపాధ్యాయిని పద్మ సంగీతం పట్ల మక్కువతో కీబోర్డ్ సాధన చేసి ప్రావీణ్యం సంపాదించారు. ఈనెల 14వ తేదీ సోమవారం హైదరాబాద్లో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. విద్యాశాఖ అధికారులు, సీసలి హైస్కూల్ పలువురు ఉపాధ్యాయులు పద్మ టీచర్ను మంగళవారం అభినందించారు.

గిన్నిస్ బుక్ అవార్డుతో పద్మ టీచర్

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాడేపల్లిగూడెం: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు సూచించారు. మంగళవారం వెంకటరమన్నగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కుంచనపల్లిలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, గత వారం జరిగిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను పరిశీలించారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుగుణ, ధనమ్మ, ఆశాలు రత్నకుమారి ప్రశాంతి రమణ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుచేసి ఇవ్వండి

తాడేపల్లిగూడెం: తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇంటి వద్ద నుంచే అందించే అలవాటు చేస్తే ప్రతి గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి సులభమవుతుందని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. జగన్నాధపురంలో మంగళవారం చెత్తను వేరు చేసే పద్ధతిపై గ్రామాల్లో, వార్డుల్లోని పంచాయతీ సిబ్బందికి గృహ వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచి ఉండ్రాజవరపు చంద్రిక మాట్లాడుతూ తమ గ్రామంలో ఇప్పటికే పారిశుధ్యంపై అవగాహన ఉందని, గ్రామస్తులంతా సహకరిస్తే చెత్తకుప్పలు లేని గ్రామంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు, ఎంఆర్సి ఎం.రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

తోలేరులో పోషణ పక్వాడా

వీరవాసరం: టివి, సెల్ఫోన్ ప్రభావాలను పిల్లలు, తల్లులపై ప్రభావం చూపకుండా వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యత అంగన్వాడీలపై ఉందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. పోషణ పక్వాడా అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం తోలేరులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పిల్లల పోషణ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఐసిడిఎస్ భీమవరం ప్రాజెక్ట్ అధికారి టికెవి.లక్ష్మీకాంతం మాట్లాడారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్త నిర్మలను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి వేండ్ర వెంకట లీలాకృష్ణ, సరోజని, ఎఎన్ఎం సరస్వతి, భవాని, దేవి, రమణ, వెంకట నరసమ్మ పాల్గొన్నారు.

తోలేరులో పోషణ వాటికను పరిశీలిస్తున్న ఎంపిపి, సిడిపిఒలు

పాలకొల్లు రూరల్: పాలకొల్లు మండలం యాళ్లవాని గరువు అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్.మల్లేశ్వరి ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడాఉ. శిశువులకు ఆరు నెలల వరకూ తల్లి పాలు ఇవ్వాలని, తల్లి పాలకు మించిన ఔషధం లేదని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎసిఒపియు పి.నాగరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు వి.పద్మ పాల్గొన్నారు.

పెదమల్లంలో 'నేను బడికి పోతా'

ఆచంట: బడి బయట పిల్లలు లేని గ్రామంగా తీర్చిదిద్దడమే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్యోద్దేశమని ఎంఇఒ-1 ఎ.ఉషారాణి, ఎంఇఒ-2 పి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం పెదమల్లంలో నేను బడికి పోతా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం గ్రామ వాలంటీర్ల సహాయంతో ఆ పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. స్టూడెంట్ కిట్లు ఇతర విద్యా పోత్సాహకాలు అందిస్తామన్నారు. నూతనంగా బడిలోకి చేరిన పిల్లల సామర్థ్యం, వయసుకు తగిన తరగతుల్లో చేర్చి ఆ తరగతి స్థాయిని అందుకునేందుకు బ్రిడ్జి కోర్సులు ఉపయోగించడం, బయట పిల్లలందరినీ బడిలోకి చేర్చే బడి బయట పిల్లలు లేని గ్రామంగా తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాంపాటి కాశీవిశ్వనాథ్, శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు

8 గంటల పని దినాన్ని కాపాడుకుందాం

వీరవాసరం : ఎనిమిది గంటల పని దినాన్ని కాపాడుకుందాం నినాదంతో మేడే ను నిర్వహించాలని సిఐటియు మండల కమిటీ నిర్ణయించింది. మంగళవారం జరిగిన సిఐటియు మండల కమిటీ సమావేశం డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ 8 గంటల పని దినం కోసం చారిత్రక పోరాటం జరిగిందని, అందులో భాగంగానే మేడే ఏర్పడిందని అన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాన్ని నేటి పాలకులు సక్రమంగా అమలు చేయకుండా 12 గంటలు 15 గంటలు 24 గంటలుగా మార్చి వేస్తున్నారన్నారు. దీనివల్ల నిజ వేతనం పడిపోవడంతో పాటు కార్మికుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. దోపిడీ విచ్చలవిడిగా పెరుగుతుందని, దీన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించటం సిగ్గుచేటని అన్నారు. సమావేశంలో వివిధ రంగాల కార్మికులతోపాటు సిఐటియు మండల నాయకులు సత్యవతి, కొత్తల సత్తిబాబు, మద్దాల శ్రీను, శ్యామల, ఝాన్సీ, పార్వతి, భవాని తదితరులు పాల్గొని మాట్లాడారు.

పేదలకు నిత్యావసర సరుకులు అందజేత

ఆచంట: పెదమల్లం గ్రామానికి చెందిన దాత ఎడ్ల మారియ్య ఉద్యోగం రీత్యా విశాఖపట్నంలో కస్టమ్స్ అధికారిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఆ గ్రామానికి చెందిన 25 మంది పేదలకు ఉచితంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరం నుంచి గ్రామానికి చెందిన 25 మంది పేదలకు రూ.1,200 విలువైన సరుకులు ప్రతినెలా పంపిణీ చేస్తూ దాతృత్వాన్ని నిరూపించుకుంటున్నారు. అలాగే మరో 50 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. దాత మారియ్యను స్థానికులు డి.రాంబాబు, మాజీ సర్పంచి అంజూరి శారాబంధు రాజు, విప్పర్తి ఆనంద్రావు, పుల్లెల జాన్, కాంపాటి మాచిరాజు అభినందించారు.

గ్రామాభివృద్ధిపై ఎంఎల్ఎ నాయకర్ సమీక్ష

నరసాపురం: నియోజకవర్గంలోని మొగల్తూరు, నరసాపురం మండలాల సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలతో జనసేన కార్యాలయంలో మంగళవారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సమీక్షించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలను అధికారులకు వివరించి తక్షణం పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా సీతారాంపురం, పేరుపాలెం, కెపి.పాలెం, మొగల్తూరు హైవే రోడ్లపై ఆవులు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, వాటి యజమానులను హెచ్చరించి సమస్యను పరిష్కరించాలన్నారు. లేకపోతే పశువులను స్వాధీనం చేసుకుని, యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దర్బరేవు, మర్రితిప్ప గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

సుబ్బారాయుడు మృతి

పాలకొల్లు : రాష్ట్రంలో 1998 డిఎస్సి క్వాలిఫైడ్ టీచర్ల సుదీర్ఘ పోరాటంలో అలుపెరగకుండా పోరాటం చేసి, సంఘం అధ్యక్షునిగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎర్రంశెట్టి సుబ్బారాయుడు(60) మృతి చెందారు. ఆయనకు భార్య, ఇరువురు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్సి అంగర రామ్మోహన్ రావు సంతాపం తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తే ఊరుకోబోం

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోబోమని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల రవి వీరభద్రరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని వేల్పూరు, ఎర్రయిచెరువు గ్రామాల్లో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీరభద్రరావు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు పనులు లేని సమయంలో ఉన్న ఊరిలోనే పని కల్పించి వలసలు నివారించాలని అందుకు తిండైనా పెట్టండి పనైనా చూపించండి నినాదంతో దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం, కమ్యూనిస్టులు చేసిన అనేక పోరాటాల ఫలితంగా ఉపాధి చట్టం రూపొందించిందన్నారు. గ్రామాల్లో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించడమే లక్ష్యంగా 2005లో ఉపాధి హామీ యుపిఎ -1 ప్రభుత్వం ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికే చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కూలీలకు మరోపక్క పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలతో సతమతమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి అని ఆదరించి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించి, రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశంలో చనిపోయిన ఉపాధి కూలీకి రూ.10 లక్షల బీమా చెల్లించి కూలీల కుటుంబాలను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పితాని బాలాజీ, పాలా వెంకటలక్ష్మి, కడలి భవాని, వీరవల్లి దేవి, మంగ, పితాని లక్ష్మి, మంగ, పితాని ఈశ్వరి పాల్గొన్నారు.

రైల్వే గూడ్స్ షెడ్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక మంగళవారం జరిగింది. ఇప్పటివరకూ జరిగిన సభ కార్యకలాపాల రిపోర్టులను యూనియన్ కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి యూనియన్ సభ్యులకు తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కర్రి నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా సత్తి కోదండరామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కర్రి సాయి రెడ్డి, కార్యదర్శిగా చిర్ల పుల్లారెడ్డి, సహాయ కార్యదర్శిగా కర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా ఎస్విఎస్.రెడ్డి, మెంబర్లుగా కర్రి సుబ్బిరెడ్డి, ఆకుల నారాయణ, ఆడప ఆంజనేయులు, బుద్దాల నాని, మద్దాల పుత్రయ్య, కర్రి శ్రీనివాస్ రెడ్డి, అడ్డగర్ల కృష్ణ, గాది వెంకట్రావు ఇలా 13 మందితో నూతన కమిటీ ఏర్పడింది. సంఘం అభివృద్ధికి పాటుపడడమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ తెలిపింది. కార్యక్రమంలో జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, చల్లా చంద్రరావు, చిటికెన రాము, నర్మల కృష్ణ, యార్డు రాజేష్, సింగలూరు నాగేశ్వరరావు, ఎం.రాజు, సభ్యులు పాల్గొన్నారు.

సిపిఎం సీనియర్ నేత సూర్యారావు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిపిఎం సీనియర్ నాయకులు తూటే సూర్యారావు (85) సోమవారం రాత్రి 9 గంటలకు ఆయన స్వగ్రామం పొలమూరులో ఇంటి వద్ద కన్నుమూశారు. సూర్యారావు సిపిఎం సభ్యుడిగా సుమారు 45 సంవత్సరాలు కొనసాగుతున్నారు. రిక్షా కార్మికుడిగా, గుర్రపు బండి సూర్యారావుగా సుపరిచితుడు. నౌడూరు సెంటర్లో రిక్షా కార్మిక సంఘం ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. పొలమూరు అంబేద్కర్ కాలనీలో సమస్యలపై ఆయన పనిచేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. మనవడు తూటే సురేష్ సిపిఎం కార్యకర్తగా పనిచేస్తున్నారు. ఆయన సిపిఎం పొలమూరు గ్రామ శాఖ, పెనుమంట్ర మండల కమిటీ, జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం తెలిపింది. సూర్యారావు మతికి సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్, సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, కె.గోపాలన్, లింగం సత్యనారాయణ నాయుడు, ఆకుల హరేరామ్, కె.జ్యోతి బసు, సిహెచ్.తిరుమలరావు, కె.పద్మజ, బి.శేఖర్, రామకృష్ణ, సంపత్రావు, సిపిఎం మండల కార్యదర్శి కె.ప్రసాద్, కె.సుబ్బారాజు, ఎన్.చిత్రంజన్, బి.విజయ్, పెచ్చెట్టి సత్యనారాయణ, పిల్లి రాజారావు, పంపన సూర్యనారాయణ, కె.శ్రీరామ్మూర్తి, కట్టా సత్యం, టి.ఆంజనేయులు, విఎస్ఎస్వి.ప్రసాద్ తదితరులు సంతాపం తెలిపారు.

సూర్యారావు (ఫైల్ఫొటో)

వాటర్ ట్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

నగర పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్ను మంగళవారం జిల్లా కలెక్టర్ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు ప్రారంభించారు. సుమారు 5000 లీటర్ల సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకర్కు అనుసంధానంగా ట్రాక్టర్ కూడా కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్, జిల్లా పోలీసు అధికారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శానిటరీ, సచివాలయ సిబ్బందితో కలిసి మంగళవారం పర్యటించారు. డ్రెయినేజీలో పూడికతీయడం, ఇంటింటికీ చెత్త సేకరణకు వస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ పాత్రుడు, శానిటరీ మేస్త్రీ రమేష్, సిబంది పాల్గొన్నారు.

కొనసాగిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

అగ్నిమాపక వారోత్సవాలను రెండో రోజు మంగళవారం నరసాపురంలో నిర్వహించారు. అగ్నిమాపక సిబ్బంది పట్టణంలోని బస్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో, రద్దీ ప్రాంతాల్లో, మెయిన్ రోడ్డులోని షాపులవారికి, పంజా సెంటర్లో ఉన్న విక్టరీ బజార్లోని సిబ్బందికి, ఇతర షాపుల్లో పనిచేసే సిబ్బందికి, యాజమాన్యానికి అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సిబ్బంది ఉపయోగించే పద్ధతులను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరసాపురం కేంద్ర అగ్నిమాపక అధికారి కె.భాస్కర్ రామమ్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా రెండో రోజు పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం పరిధిలో ప్రజలు, వ్యాపారస్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. బస్ స్టాండ్, రైల్వేస్టేషన్లలో, లాక్ సెంటర్, మారుతీ సినిమా థియేటర్, అడబాల సినిమా థియేటర్, పెద్దగోపురం వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమాల్లో పాలకొల్లు అగ్నిమాపక కేంద్రం సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవి.జానకిరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరంలో అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఎవిజి సినిమాస్లో 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్ర యూనిట్ మంగళవారం సందడి చేసింది. హీరో ప్రదీప్, హీరోయిన్ దీపిక పిల్లి యూనిట్ సభ్యులు ప్రేక్షకులతో మాట్లాడారు. చిత్రానికి ఇంతటి విజయాన్ని అందించేందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి చోటా విశేష స్పందన లభిస్తోందని, ప్రేక్షకులకు నచ్చే ప్రతి చిత్రాన్నీ చేస్తామని ప్రదీప్ అన్నారు. వారితో సెల్ఫీలు దిగేందుకు అభిమానులు ఎగబడ్డారు.

మాట్లాడుతున్న ప్రదీప్

మైక్రో ఫిల్టర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండి

కలిసిపూడిలో మైక్రో ఫిల్టర్ నిర్మాణ పనులకు గ్రామ సర్పంచి కేశబోయిన జానకి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైక్రో ఫిల్టర్ మంజూరు చేసినందుకు డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగు నీరందించేందుకు ఎంపిపి నిధులు రూ.2.5 లక్షలు మంజూరు చేసినందుకు ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచి మంతెన చంటి రాజు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో 2025-26 సంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మంగళవారం తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులు 2024-25లో బ్యాక్లాగ్ పాసైన విద్యార్థులు డిగ్రీలో అడ్మిషన్లు పొందొచ్చని చెప్పారు. తమ కాలేజీలో బిఎ, బిఎస్సి, బికాంలో అయిదు కోర్సులు ఉన్నాయని తెలిపారు. అదనపు వివరాల కోసం 7901056668 నంబర్ను సంప్రదించవచ్చని తెలిపారు.

అన్ని గ్రామాలనూ అభివృద్ధి చేస్తాం

అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి, ఎంఎల్ఎ శంకుస్థాపనలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మండలంలోని నరసింహాపురంలో రూ.కోటీ 31 లక్షలతో పలు అభివృద్ధి పనులకు మంగళవారం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షలతో నూతన సచివాలయాన్ని ప్రారంభించగా, రూ.45 లక్షలతో మైక్రో ఫిల్టర్, రూ.26 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి కేంద్ర మంత్రి వర్మ, ఎంఎల్ఎ అంజిబాబు శంకుస్థాపనలు చేశారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ ఇన్ఛార్జిలు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామంలో సుమారు రూ.కోటీ 78 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులుతో కలిసి, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి వర్మ అన్నారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో మంచినీటిని అందించడమే లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ ఇన్ఛార్జులు, ప్రభుత్వ అధికారులు, నేతలు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రోత్సాహం అభినందనీయం

ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

విద్యా సంస్థలు విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించడం అభినం దనీయమని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. పట్టణంలోని గౌతమి విద్యాసంస్థల్లో ఏర్పాటు చేసిన స్కేటింగ్ కోర్టును బొమ్మిడి నాయకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకర్ మాట్లాడుతూ చిన్ననాటి నుండే చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడల్లో రాణించి ఎందరో క్రీడాకారులను స్ఫూర్తిగా తీకోవాలన్నారు. ఇంటర్ ఫలితాల్లో పట్టణానికి తొలి స్థానం తీసుకొచ్చిన విద్యార్థినులను నాయకర్ అభినందించారు. అనంతరం ఎంఎల్ఎను గౌతమి విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాడెంట్ చినమిల్లి దుర్గాప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.రామచంద్రరావు, ఎమ్డి ఘాఫర్ ఖాన్, డిగ్రీ ఇన్ఛార్జి వి.సత్యనారాయణ, కైలా నరేష్, చినమిల్లి చంటి, కె.రఘు పాల్గొన్నారు.

కోర్టును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ నాయకర్

బాలికల హాస్టల్కు యూనియన్ బ్యాంక్ సాయం

ప్రజాశక్తి - భీమవరం

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని భీమవరం యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం వారు సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహానికి సహకారం అందించారు. ఉచితంగా 10 సీలింగ్ ఫాన్లు, మైక్రో వాటర్ ఫిల్టర్ సమకూర్చారు. యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ పి.సంగీత కుమారి చేతుల మీదుగా మంగళవారం అందజేసి మాట్లాడారు. ప్రతి విద్యార్థీ అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. తమ యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో అనేక సేవలందిస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా నిరుపేద పిల్లలకు చేయూతనిచ్చే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ వసతి గృహానికి సహకారం అందించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో అనేక సేవలు యూనియన్ బ్యాంక్ ద్వారా అందించే విధంగా ముందుకు సాగుతామన్నారు. యూనియన్ బ్యాంకు డిప్యూటీ రీజినల్ హెడ్.సత్యనారాయణ, ఎస్సి, ఎస్టి అసోసియేషన్ నాగరాజు, సునీల్, గంగయ్య, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్, హాస్టల్ వార్డెన్ భానుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ అందిస్తున్న యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సంగీత కుమారి

సత్యనారాయణకు కందుకూరి పురస్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు కళా పరిషత్ ప్రధాన కార్యదర్శి, రంగస్థల నటుడు మానాపురం సత్యనారాయణ జిల్లా కందుకూరు పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 16న కందుకూరు వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ తుమ్మలపల్లి వారి కళా క్షేత్రంలో ఈ అవార్డును అందజేయనున్నారు. రాష్ట్రంలో ముగ్గురికి రాష్ట్ర అవార్డులు, 130 మందికి జిల్లా కందుకూరు పురస్కారాలు అందజేయనున్నారు. మానాపురం సత్యనారాయణకు కందుకూరి రంగస్థలం పురస్కారం రావడం పట్ల పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షులు కెవి.కృష్ణవర్మ, గౌరవాధ్యక్షులు మేడికొండ శ్రీనివాసరావు (చౌదరి), ఉపాధ్యక్షులు కెఎస్పిఎన్.వర్మ, విటాకుల రమణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, కోశాధికారి కొణిజేటి గుప్త, సహాయ కార్యదర్శి దాసరి నాని, రెడ్డి వాసు తదితరులు అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ మండలాల్లో ఖాళీగా ఉన్న 10 అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారి అంగర కృష్ణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మల్లిపూడి-2 అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త పోస్టుకు ఓపెన్ కేటగిరిలో దరఖాస్తు చేసుకోవాలని, మిగిలిన 9 పోస్టులు అంగన్వాడీ సహాయకులని తెలిపారు. పెనుమంట్ర-7 (బిసి డి), వివి.పాలెం (ఎస్.సి), వెలగలేరు-2 (ఒసి), పెనుగొండ-13 (బిసి బి), మల్లపుదిబ్బ (ఎస్ సి), సిద్ధాంతం-6 (ఎస్సి), పద్మనాభుని చెరువు (బిసి బి), నీరుల్లిపాలెం (ఎస్సి), అయోధ్యలంక (బిసి ఎ) పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో స్థానికంగా ఉండి, టెన్త్ పాసై 21 నుండి 35 సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న ఆ ఊరి కోడళ్లు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు స్థానిక కార్యాలయంలో గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

భీమవరం టౌన్ : ఐసిడిఎస్ భీమవరం ప్రాజెక్ట్ పరిధిలోని టౌన్, రూరల్లో అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి.లక్ష్మీకాంతం ఆదివారం ప్రకటనలో కోరారు. టౌన్లో నెహ్రూనగర్ రాంబద్ర బాడవ స్ట్రీట్లో బిసిబికి, లోసరిలో జనరల్, వెంప్రతి సెంటర్కు ఎస్సి కేటగిరి పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ పోస్టులకు 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలిపారు. స్థానికులై ఉండాలని, కనీస విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు విస్సాకోడేరులోని తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మొగల్తూరు : మొగల్తూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం పరిధిలోని ఖాళీలు భర్తీ చేయనున్నామని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ బి.ఊర్మిళ ఒక ప్రకటనలో తెలిపారు. కాళీపట్నం తూర్పు జనరల్, లక్ష్మణేశ్వరంలోని ముప్పేపాలెంలో బిసి ఎ, ఎల్బి చర్లలోని బైనవపాలెం ఇడబ్ల్యూఎస్, సీతారాంపురం సౌత్ లోని పిల్లి పేట ఎస్సి, వేములదీవి పడమరలోని కొత్తపేట ఎస్సి, సరిపల్లిలోని సరిపల్లె గరువు ఎస్సి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

చిన్నారుల వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - ఉండి

విద్యార్థుల్లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉండి నాలుగో సచివాలయం ఎంఎల్హెచ్ పి.శృతి అన్నారు. ఉండి గోరింతోటలోని మండల పరిషత్ పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఆమె తెలుకున్నారు నమోదు చేయించారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి వ్యాధులున్నా తెలుసుకుని వారికి అవసరమైన మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొంతమంది విద్యార్థులకు ఐడి లేకపోవడం వల్ల దాన్ని క్రియేట్ చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. దీనివల్ల చిన్నారులకు భవిష్యత్తులో ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిరాలు సిహెచ్.కాంతమ్మ, ఆశా కార్యకర్త, పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

ఆరోగ్యవంతమైన పట్టణంగా తీర్చిదిద్దుతాం

తాడేపల్లిగూడెం: ఆరోగ్యవంతమైన పట్టణంగా తాడేపల్లిగూడేన్ని తీర్చిద్దుతామని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 1వ వార్డు, 32వ వార్డుల్లో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొని మాట్లాడారు. 2014, 2019 మధ్య మున్సిపల్ రిజర్వ్ స్థలం అయిన 1వ వార్డులో ఇండోర్ స్టేడియం, 32వ వార్డులో స్విమ్మింగ్ పూల్ నిర్మాణానికి మున్సిపల్ తీర్మానం చేసి శంకుస్థాపన చేశారు. గత వైసిపి ప్రభుత్వం నిధులు రానివ్వకుండా అడ్డుకోవడంతో నిర్లక్ష్యానికి గురైన ఈ రెండు పనులను నేడు యుద్ధ ప్రాతిపదికన చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్యుడు సైతం తమ పిల్లలకు అత్యంత అధునాతన స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియంలో సదుపాయాలను అందించాలని తన సొంత నిధులు, దాతల సహకారంతో పనులు పూర్తి చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నాలుగు నెలల్లో పనులను పునరుద్ధరించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.వెంకటరమణ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పవన్ కుమార్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో వరదరాజపురం సబ్స్టేషన్ పరిధిలోని వెలగపల్లి, వరదరాజపురం, అర్ధవరం, వల్లూరు, వాకపల్లి, వీరేశ్వరపురం, మొగ్గళ్ల, కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరశింహమూర్తి మంగళవారం తెలిపారు. ఆయా గ్రామాల్లో పాతలైన్లకు మరమ్మతులు, కొత్త లైన్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు చెప్పారు. ఆక్వా రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

సిఎం సహాయ నిధి అందజేత

నరసాపురం: స్థానిక జనసేన కార్యాలయంలో మంగళవారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, నిప్పులేటి తారకరామారావు, బొమ్మిడి సూర్యకుమారి కృష్ణమూర్తి, అందే దొరబాబు పాల్గొన్నారు.

పాస్పోర్టు పోయినది

VODUGU LAXMI అను నాకు విశాఖపట్నం పాస్పోర్టు కార్యాలయం అధికారులు ది.23-10-2019న T8573746 నెంబరు గల పాస్పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.2-04-2025న బియ్యపు తిప్ప గ్రామం నుండి నరసాపురం మండలం, వేములదీవి గ్రామంలోని సెంటర్కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్పోర్టు పోయినది. గాన నా పాస్పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

VODUGU LAXMI
W/o. Vodugu Srinu
D.No. 2-30, Sitarama Nagar, Biyyapu Tippa
Narasapuram (M), W.G.Dt., A.P.

పాస్పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుగొండ మండలం, వెంకట్రామపురం గ్రామానికి చెందిన గంగోలి సుసన్న, W/o. దుర్గా కుమార్ పొత్రాజ్ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. వెంకట్రామపురం ఇంటి దగ్గర నుండి పెనుగొండ బైక్ పై వస్తుండగ నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. **పాస్పోర్ట్ నెంబర్ : M2693664** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

గంగోలి సుసన్న
W/o. దుర్గా కుమార్ పొత్రాజ్
వెంకట్రామపురం,
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా,
Cell No: 80083 23352

ప్రకటన
మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P.No. 7/2023

Between:
బొక్కా శ్రీరామకృష్ణమూర్తి ...పిటిషనర్
and
బొక్కా లక్ష్మీహేమదుర్గ ...రెస్పాండెంటు

రెస్పాండెంటు:
To:
బొక్కా లక్ష్మీహేమదుర్గ
W/o బొక్కా శ్రీరామకృష్ణమూర్తి
D/o యనమదాల ఏడుకొండలు
హనుమాన్ టెంపుల్, పూలపల్లి, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు కేసులో పిటిషనర్, మీ పైన విడాకుల నిమిత్తం పిటీషన్వేయగా మీకు శ్రీ కోర్టు వారు మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినప్పటికిని మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పేపర్లో ప్రకటనకు ఆర్డర్ వేసియున్నారు.

కావున పై నెంబరు కేసులో ది. 01-05-2025వ సం॥రం తేదీన ఉదయం గం॥ 10-30 ని॥లకు మీరు గాని, మీ అడ్వకేట్ ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

// By orders of Court //

వాయిదా: 01-05-2025

Rampa Pullaji M.A.,B.L, Advocate, Narsapuram, Cell: 9849300413
Narsapuram
Dt. 15-04-2025